క్లుప్తంగా

నగదు పట్టివేత



దబ్బును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

రామాయంపేట(మెదక్): మండలంలోని దామరచెరువు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు ఒక వ్యక్తి వద్ద రూ. 50,200 స్వాధీనపర్చుకున్నారు. హైదరాబాద్ వైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా, డబ్బులు పట్టుబడ్డట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు.

బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఫారూక్ హుస్సేన్

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రం అల్లాదుర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ఫారూఖ్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే క్రాంతికిరణ్ గెలుపుకోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో ఇంటింట ప్రచారం ముమ్మరం చేయాలన్నారు. అనంతరం మండలంలోని రాంపూర్ గ్రామానికి పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యే క్రాంతికిరణ్ చేరారు. ఇందులో పార్టీ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, నాయకులు రవి పాల్గొన్నారు.

సర్పంచ్‌ల్లో బైండోవర్ కలకలం

పాపన్నపేట(మెదక్): ఎన్నికల వేళ సర్పంచ్‌లను బైండోవర్ చేస్తుండటంతో కలకలం మొదలైంది. పాపన్నపేట మండలంలో బుధవారం పలువురు సర్పంచ్‌లను బైండోవర్ చేయడానికి ఆధార్ కార్డులు తెమ్మని ఎస్‌ఐ మహిపాల్ రెడ్డి కోరడంతో సర్పంచ్‌లు మండిపడ్డారు. తమకు ఎలాంటి నేర చరిత్ర లేకున్నా, కేసులు నమోదు కాకున్నా.. బైండోవర్ ఎలా చేస్తారని మల్లంపేట సర్పంచ్ బాపురెడ్డి ప్రశ్నించారు. మండలంలో మొత్తం 14 మందిని బైండోవర్ చేయాల్సిందిగా ఆదేశాలు వచ్చాయని ఎస్‌ఐ తెలిపారు. ఎన్నికల్లో అల్లర్లు జరగడానికి అవకాశమున్న గ్రామాల సర్పంచ్‌లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయనున్నట్లు చెప్పారు. కాగా మండలానికి చెందిన మాజీ ఎమ్మెల్యేతో పాటు అధికార, ప్రతిపక్ష, మాజీ సర్పంచ్‌లు ఈ లిస్టులో ఉన్నట్లు తెలిసింది.

ఓటు వినియోగంపై కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

నర్సాపూర్ రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు నర్సాపూర్ పట్టణంలో పలుచోట్ల సాంస్కృతిక సారథి కళాకారులతో ఓటు వినియోగంపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఒక్కరు ఓటు వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి, ఏపీఎం గౌరీ శంకర్, కళాకారులు ఎల్లయ్య, రామారావు, సిద్ధులు, తుమ్మల ఎల్లయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గెలుపు ఓటములు సహజం



క్రీడాకారులతో రాజిరెడ్డి

కౌల్దారం(నర్సాపూర్): గెలుపు ఓటములు సహజమని, యువత సన్మార్గంలో నడిచేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఏటిగడ్డ మాందాపూర్‌లో గ్రామస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు గురువారం ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో అరవింద్ గౌడ్ జట్టు విజయం సాధించింది. విజేత జట్లకు బహుమతులను రాజిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, నాయకులు ప్రవీణ్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, మల్లేశం, అంజాగౌడ్, గోవర్ధన్, మహేశ్వర్ రెడ్డి, అక్రం, బండి మల్లేశం, రియాజ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.



శివ్వంపేట(నర్సాపూర్): పిల్లుట్లలో అమ్మవారి శోభాయాత్రలో భక్తులు

కనులపండువగా దుర్గామాత నిమజ్జనోత్సవం

జిల్లా వ్యాప్తంగా మండపాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. బుధవారం శోభాయాత్రలో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో ఊరేగించి, చెరువుల్లో నిమజ్జనం చేశారు.



శివ్వంపేటలో..



మెదక్ కలెక్టరేట్: ఎన్‌డీవై జమ్మికుంట కాలనీలో ..



కాడిపల్లిలో ..



నర్సాపూర్ రూరల్: దుర్గామాతను ఊరేగిస్తున్న భక్తులు



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో ..

బీఆర్‌ఎస్‌తోనే మెదక్‌కు పూర్వ వైభవం

మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): మెతుకు సీమకు పూర్వ వైభవం తెచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని మెదక్ మాజీ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ నాయకుడు శశిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతనగరంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్‌ను జిల్లా కేంద్రంగా చేసి, కొత్త కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించి, రైతులకు ఘనపురం నీళ్లు ఇచ్చిన ఘనత ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిదే అన్నారు. ఆయన వెంట మండల రైతు సమన్వయ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ బుజ్జమ్మ, నాయకులతో పాటు తదితరులు ఉన్నారు.

దుబ్బాకలో బీజేపీ జెండా ఎగరేద్దాం

పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): దుబ్బాకలో బీజేపీ జెండా ఎగరేద్దామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ అధ్యక్షులు, పన్నా ప్రముఖ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలన్నారు. గత ఉప ఎన్నికల్లో రఘునందన్‌రావు గెలుపొందిన తర్వాతనే దుబ్బాకలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. దుబ్బాకలో జాబ్ మేళా నిర్వహించి వేలాది మంది యువతకు ఉద్యోగాలు కల్పించిన ఘనత రఘునందన్‌రావుకు దక్కిందన్నారు. అలాగే యువకులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్‌ఎస్ విఫలమైందన్నారు. ఇంటికో ఉద్యోగం పేరుతో యువతను ప్రభుత్వం మోసంచేసిందని విమర్శించారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ నియోజకవర్గాలు మాత్రమే అభివృద్ధి చెందాయన్నారు. దుబ్బాక పై మంత్రి సవతి తల్లి ప్రేమ చూపడం అన్యాయమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించే నాయకుడు రఘునందన్‌రావు అన్నారు. దుబ్బాకలో బీజేపీ భారీ మెజార్టీతో గెలిచేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం, నాయకులు పాల్గొన్నారు.

ఆరుగురిపై అట్రాసిటీ కేసు

తూప్రాన్: కులం పేరుతో దూషించిన ఆరుగురు వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శివానందం బుధవారం తెలిపారు. మండలంలోని దాతర్‌పల్లిలో దసరా పండుగ రోజున ముదిరాజ్ కులానికి చెందిన చింతల శ్రీకాంత్, పుట్నాల వెంకటేశం, చింతల కృష్ణ, చింతల వంశీ, చింతల నవీన్, చింతల పవన్‌కల్యాణ్ అనే ఆరుగురు అసభ్య పదజాలంతో తిడుతూ కులం పేరుతో దూషించి, కొలిచెలిమె లక్ష్మణ్‌తో పాటు మరికొందరిపై దాడికి పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

లక్ష మెజార్టీతో కేసీఆర్‌ను గెలిపిస్తాం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

గజ్వేల్‌రూరల్: తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపిస్తామని మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ వినూత్న పథకాలను అమలుచేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. మిషన్ భగీరథ పథకంతో తాగునీటి ఇబ్బందులు తొలగించారని, నిరుపేదలకు అండగా నిలుస్తూ ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను చేపట్టారన్నారు. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తూ ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించారని గుర్తు చేశారు. గజ్వేల్ నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహించడం ఈ ప్రాంతం అభివృద్ధిలో 50 ఏళ్ల ముందుకు వెళ్లిందని కొనియాడారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన బైక్

యువకుడు మృతి



కరుణాకర్ (ఫైల్)

నర్సాపూర్‌రూరల్: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండలంలోని తుల్జారాంపేట శివారులో బుధవారం చోటు చేసుకుంది. మృతుడి తండ్రి శ్రీశైలం, పోలీసులు తెలిపిన వివరాలు ఉన్నాయి. మండల పరిధిలోని అవంచ గ్రామానికి చెందిన తలారి శ్రీశైలంకు ముగ్గురు కొడుకులున్నారు. రెండో కుమారుడైన తలారి కరుణాకర్ ఓ ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున కంపెనీలో పనిచేసేందుకు అతడు తనబైక్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో తుల్జారాంపేట వద్దకు చేరుకోగానే బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన గల చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించినట్లు మృతుడి తండ్రి తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



కుమార్(ఫైల్)

హవేళిఘనాపూర్(మెదక్): దుర్గమ్మ నిమజ్జనం అనంతరం చెరువులో స్నానం చేసేందుకు వెళ్లిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని సర్దన గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన డప్పు కుమార్(32) వృత్తిరీత్యా డప్పుకొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం దుర్గమ్మను నిమజ్జనం చేశాక.. గ్రామ శివారులోని తన స్నేహితులతో కలిసి పోతుకుంటలో స్నానం చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో నీటిలో స్నానం చేస్తుండగా ఫిట్స్ రావడంతో నీటిలో మునిగి పోయాడు. ఈ విషయాన్ని గమనించిన తోటి స్నేహితులు ఆయనను బయటకు తీసుకొచ్చే లోపే మృతి చెందాడు. మృతుడికి భార్య గొడవపడి వెళ్లిపోగా వెంకట్ తన తల్లి యశోద వద్ద జీవనం సాగిస్తున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు హవేళిఘనాపూర్ ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ మురళీకృష్ణ

నిజాంపేట(మెదక్): ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. మండలంలోని నస్కల్ గ్రామంలో ఏపీజీవీబీ బ్యాంక్ రుణాలపై విభూతి బ్రదర్స్, ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో రైతులకు, డ్వాక్రా మహిళా సంఘాలకు ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన మంత్రి జీవన జ్యోతి పథకం సురక్ష బీమా యోజన పథకం అటల్ పెన్షన్ యోజన పథకం రికవరింగ్ డిపాజిట్ లాంటి ఎన్నో పథకాల ప్రజలకు కల్పించారని అన్నారు. మహిళా సంఘాలకు తక్కువ వడ్డీతో లోన్లను ఇస్తున్నట్లు, ఆన్‌లైన్ బ్యాంక్ సదుపాయాలపై తెలియజేశామన్నారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా రవాణా సమయాన్ని ఆదా చేసుకోవాలని, ప్రతీ లోన్‌ను ఏటా మే నెలలో రెన్యువల్ చేసుకోవాలన్నారు. మీ ఫోన్‌లకు ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ నంబర్లు చెప్పాలని అడిగినచో మీరు చెబితే మీ డబ్బులు కాజేస్తారని తెలిపారు. అలా చేస్తే మొదటగా 1930 మొదటగా డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట నోడల్ ఆఫీసర్ రవికుమార్, క్యాషియర్ రవిమనోహర్, ఫీల్డ్ ఆఫీసర్ భాస్కర్ సీసీ సరూప, బ్యాంక్ మిత్ర మురళి, రమేశ్, రవి డ్వాక్రా మహిళా సంఘాల లీడర్లు రేణుక, నాగరాణి, స్వప్న, జ్యోతి, మంగ, డ్వాక్రా మహిళలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ట్రాక్టర్ టైర్ల మార్పిడి

దుండగులపై పోలీస్‌లకు ఫిర్యాదు



ట్రాక్టర్ టైర్లను చూపుతున్న ఉపసర్పంచ్, గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మల్లుపల్లి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ టైర్లను మార్చి, వాటి స్థానంలో పాతవి అమర్చిన దుండగులపై గ్రామస్తులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. బుధవారం మండలంలోని మల్లుపల్లి గ్రామంలో వెలుగులోకి వచ్చిన టైర్ల మార్పిడిపై గ్రామస్తులు గ్రామపంచాయతీ వద్ద ఆందోళన చేపట్టారు. ఆరునెలల క్రితం ట్రాక్టర్ టైలర్లను కొనుగోలు చేయగా, ఇప్పుడు సిల్‌టైర్లు ఉన్నాయని తెలిపారు. మరో మూడు నెలల్లో పంచాయతీ పాలకవర్గం పదవి కాలం ముగియనుండగా పాలకవర్గంలోని వారే కొత్త టైర్లను కాజేసి పాతవి అమర్చారని గ్రామస్తులు ఆరోపించారు. ఇదే విషయంపై గ్రామ కార్యదర్శి ప్రశాంత్‌ను ప్రశ్నించగా.. తనకేం తెలియదని చెప్పాడు. ట్రాక్టర్ టైలర్ టైర్లను మార్చినవారిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని ఉపసర్పంచ్ శ్రీకాంత్, బీఆర్‌ఎస్ నాయకులు గణేశ్, నరేశ్ కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

హవేళిఘనాపూర్(మెదక్): మండల పరిధిలోని కూచన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో బుధవారం చేరారు. వీరికి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వంద మంది కాంగ్రెస్ నాయకులకు బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మామిళ్ల ఆంజనేయులు, బీఆర్‌ఎస్ నాయకులు కొంపల్లి సుభాశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల సతీశ్, మన్నె యాదగిరి తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గజగట్లపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. మెదక్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సర్పంచ్ మీనా ఆధ్వర్యంలో 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, మత్స్యకార సంఘం అధ్యక్షుడు వెంకటేశం, ముదిరాజ్ సంఘం సభ్యులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఆర్థికసాయం అందిస్తున్న జెడ్పీటీసీ

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో మృతి చెందిన వడ్ల వీరమణి, కుంట్ల పాండరితో పాటు తీవ్ర గాయాలపాలైన వర్గంటి శ్యామల, వరలక్ష్మి కుటుంబాలను బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొని బాధిత కుటుంబసభ్యులకు తనవంతు సాయం అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, మల్లేశం, పోతిరెడ్డి, దుర్గాగౌడ్, కిష్టాగౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, హన్మేష తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో మృతి చెందిన బోయ బాలయ్య కుటుంబాన్ని బుధవారం జిల్లా బీజేపీ నాయకుడు, నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయకుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు లక్ష్మణ్, స్వామి, మహేశ్, సతీశ్, బాల్‌రాజ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

టీఆర్‌ఎస్ నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి సీఎం కేసీఆర్‌కు భారీ మెజార్టీని కానుకగా అందించాలని రాష్ట్ర మాజీ ఫుడ్‌కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శేఖర్‌గౌడ్ అన్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో బుధవారం ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ తన చిన్నతనం నుంచి ఈ ప్రాంతమంతా తిరిగిన వ్యక్తి అని, ఇక్కడి రైతులు, ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి కేసీఆర్ అన్నారు. నిరుపేదల సంక్షేమం ధ్యేయంగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన కేసీఆర్‌కు గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుంచి మూడోసారి భారీ మెజార్టీ అందించాలని సూచించారు. గురువారం నుంచి ప్రతీ గ్రామంలో నిర్వహించే ప్రచారానికి ప్రతీ కార్యకర్త హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్, ముదిరాజ్ పీఎస్‌హెచ్ బాలకృష్ణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణ రెడ్డి, సీఎం కేసీఆర్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణగౌడ్, ఉప సర్పంచ్ మండల అధ్యక్షుడు ధర్మేందర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జావిద్‌పాషా, నాయకులు రాహుల్ రెడ్డి, పాలాటా రమేశ్, నరాల పెంటయ్య, పంజా భిక్షపతి ముదిరాజ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

గజ్వేల్‌రూరల్: నిరుద్యోగ యువతులకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూషన్ డైరెక్టర్ రాజలింగం బుధవారం తెలిపారు. గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు కలిగి, 10వ తరగతి చదివిన వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ కాలంలో వారికి ఉచిత యూనిఫాం, కోర్సు మెటీరియల్, టీ, భోజన సదుపాయాలను, కోర్సుకు సంబంధించిన టూల్ కిట్స్ అందిస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి స్కిల్ ఇండియా సర్టిఫికెట్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ రుణాలకు సహకరిస్తుందని అన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతులు, మహిళలు సిద్దిపేటలోని మెదక్ రోడ్డులో కోటిలింగాల గుడి సమీపంలో ఉన్న యూనియన్ బ్యాంకు (గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ)లో ఈనెల 31లోగా తమ ఆధార్‌కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, 3 కలర్ పాస్‌పోర్టు సైజు ఫొటోలు, 10వ తరగతి మెమో జిరాక్స్‌తో నేరుగా సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 08457 359653 నంబరులో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు సంప్రదించాలని సూచించారు.